క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సమావేశం



వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులకు స్వాగతం పలుకుతున్న ఆదోని నాయకులు

ఆదోనిరూరల్: కర్నూలులో ఎంఎస్ 9 గెస్ట్ ఇన్ హోటల్‌లో మంగళవారం జరిగిన సామాజిక న్యాయ బస్సు యాత్ర సన్నాహక సమావేశానికి ఆదోని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ ఆధ్వర్యంలో 50 మందికిపైగా నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. త్వరలో రాయలసీమ జిల్లాల్లో జరగబోయే బస్సు యాత్రను విజయవంతం చేయాలని, జగనన్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చినట్లు ఆయన చెప్పారు. తరలివెళ్లిన వారిలో కౌన్సిలర్లు చిన్నా, చలపతి తదితరులు ఉన్నారు.

పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్పమాలధారులు

ఆదోనిఅర్బన్: ఆదోనిలోని ఎస్‌కేడీ కాలనీలో అయ్యప్ప స్వామి ఆలయం నుంచి తొమ్మిది మంది అయ్యప్పమాలధారులు మంగళవారం శబరిమలైకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ముందుగా ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి మాలధారులు మాట్లాడుతూ కీ.శే. గరుడాద్రి సుబ్బయ్యశాస్త్రి ఆశీస్సులతో గురుస్వామి శ్రీనివాసులు ఆచారి ఆధ్వర్యంలో 15వ సారి మహా పాదయాత్రగా బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఆదోని-బెంగళూరు అక్కడి నుంచి భవానీ-పళని-తేని-కుమ్లీ మీదుగా 30 రోజులు యాత్ర కొనసాగించి అయ్యప్ప స్వామివారిని దర్శించుకోనున్నట్లు వెల్లడించారు.

అన్నదమ్ముల ఘర్షణ

పెద్దకడబూరు: మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో అన్నదమ్ములు ఉసేని, నరసయ్య కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం అన్నదమ్ముల మధ్య ఇంటి ముందు చెత్తను వేసే విషయంలో గొడవ ఏర్పడింది. ఇరు కుటుంబాల వారు ఘర్షణకు పాల్పడగా ఉసేని, అతని భార్య లక్ష్మి, నరసయ్య, ఆయన భార్య ఉరుకుందమ్మకు గాయాలయ్యాయి. ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



మల్లికార్జునను అభినందిస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన కోసిగి రమేష్, అనుమంతి దంపతుల కుమారుడు మల్లికార్జున సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాపియన్స్ పోటీల్లో 5 కి.మీ పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆ విద్యార్థి వైఎస్సార్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 16వ తేదీన వరంగల్ జిల్లాలో జరిగిన 34వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్స్ పోటీల్లో పాల్గొన్నాడు. 5 కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

జర్నలిస్టులకు బీమా సౌకర్యం

కోసిగి: మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జ్ మురళీమోహన్ రెడ్డి సహకారంతో పోస్టల్ బీమా సౌకర్యం కల్పించారు. మంగళవారం కోసిగిలో ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) అసిస్టెంట్ మేనేజర్ ఎస్ఎం బాషా ఆధ్వర్యంలో జర్నలిస్ట్‌లకు పోస్టల్ బీమా నమోదు చేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరికీ ఎమ్మెల్యే సొంతంగా ప్రీమియం నగదు చెల్లించి బీమా చేయించారు. త్వరలో బీమా బాండ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మండల జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

జయప్రదం చేయండి

ఆదోనిఅర్బన్: ఈనెల 29వ తేదీన గుంటూరులో జరిగే నూర్‌బాషా, దూదేకుల ముస్లింల సింహగర్జనను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్‌నబీ, ఆదోని తాలూకా అధ్యక్షుడు పి.మన్సూర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి మహబూబ్‌బాషా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వారు ఆదోనిలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో ఏడు శాతం ఉన్న నూర్‌బాషా ముస్లింలు అన్ని రంగాల్లో వెనక బడి ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారినా తరాలు మారినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నామన్నారు. రాష్ట్ర జనాభాలో రెండు, మూడు శాతం ఉన్న కులాలు చట్టసభల్లో ఉండి రాజకీయాల్లో చెలామణి అవుతున్నారని, 20 లక్షలకు పైగా జనాభా ఉన్న తమకు ఏ రాజకీయ పార్టీ ఇంత వరకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు కట్టబెట్టలేదన్నారు. తమను గుర్తించి రాజకీయాల్లో సముచితస్థానం కల్పించే పార్టీలకే మద్దతు తెలుపుతామని చెప్పారు. ఆ సంఘం నాయకులు షాలిసాబ్, మాలిక్‌సాబ్, షబ్బీర్, మస్తాన్, రాజా ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.



ఆదోనిలో వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న మహిళలు



దిబ్బనకల్ శిబిరంలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది



కందుకూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,



కందుకూరులో హాజరైన ప్రజలు

పేదల ఆరోగ్యానికి భరోసా

ఆదోనిటౌన్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏపీ చరిత్రలోనే ఏ పార్టీ, ఏ ప్రభుత్వం చేయని విధంగా వార్డులు, గ్రామాల్లో జగనన్న ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా ఏడు రకాల ఆరోగ్య పరీక్షలు చేయడం, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి లేదా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయడం, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాదిరిగా నాణ్యమైన వైద్యం అందించడం జరుగుతుందని చెప్పారు. మంగళవారం పట్టణంలోని 22, 23 వార్డుల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు పర్యవేక్షించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు బీపీ, షుగర్, రక్త పరీక్షలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, ఈసీజీ రకాల పరీక్షలను చేస్తూ వైద్య పరీక్షలతో పాటు మందులను అందజేశారు.



ఆదోనిలో సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

800 మందికి వైద్య పరీక్షలు

కల్లుబావి ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 22, 23 వార్డుల్లోని ప్రజలు విరివిగా పాల్గొన్నారు. 800 మందికి పైగానే పరీక్షలు చేయించుకొని మందులు పొందారు. కర్నూలు నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లు హార్దిక, శంకర్, అనిల్, స్థానిక వైద్యులు వైష్ణవి, షేక్‌నబీనా, మౌనిక శిబిరంలో ప్రజలకు పరీక్షలు చేసి వైద్యం అందించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, నర్సింగ్ శిక్షకులు ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సేవలందించారు. ఉదయం 9 గంటలకే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వైద్యశిబిరం వద్దకు చేరుకున్నారు. 10 గంటలకు ప్రారంభమైన శిబిరంలో డాక్టర్ల చేత పరీక్షలు చేయించుకొని మందులు పొందారు. వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఆదోనిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. ఈ మేరకు మంగళవారం దిబ్బనకల్ గ్రామంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఇబ్రహీం, సుస్మిత, మణిదీప్ రెడ్డి, తొక్కల సిద్దార్, సురేష్ బాబు పాల్గొని 500 మందికి పైగా రోగులకు వైద్య సేవలందించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీడీఓ పరిశీలించారు. ప్రజలు పౌష్టికాహారమైన ఆకుకూరలు, పప్పుదినుసులు తదితర వాటిని నిత్యం ఆహారంతో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎన్ఎంలు, ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉన్న ఊర్లోనే ఉన్నత వైద్యం

కోసిగి: రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీ కార్యదర్శి పరుశురాముడు ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్‌కుమార్ సమక్షంలో జగనన్న ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు పవిత్ర పాటిల్ చేతుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సచివాలయం పరిధిలో కందుకూరు, కామన్‌దొడ్డి, కడదొడ్డి గ్రామాల నుంచి వివిధ వ్యాధులతో పడుతున్న వారు ఓపీ ద్వారా 385 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో ప్రధానంగా రక్త పరీక్ష, డయాబెటీస్, మలేరియా, హెబీ, బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వ్యాధిగ్రస్తులను ఆరోగ్య శ్రీ ద్వారా కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే ఉచిత కంటి వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందించారు. అలాగే అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు నజీర్ అహ్మద్, రజిత, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రవల్లిక, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, సూపర్‌వైజర్లు రాముడు, కంటి వైద్య బృందం అనిల్, హెల్త్ అసిస్టెంట్ కృపానందం ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కిట్లు పంపిణీ దృశ్యం

కౌతాళం: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజల ఇళ్ల వద్దకే ఆరోగ్య సేవలు అందుతున్నాయని బంటకుంట గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నుశేకేరి గ్రామ ఇన్‌చార్జి ఆదిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నుశేకేరిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 13వ రోజు క్యాంపును మంగళవారం ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా గ్రామాల్లోనే శిబిరాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, అన్ని స్థాయిల్లో ప్రజలకు సేవలు అందించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. అనంతరం కంటి అద్దాలను, ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేసి పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. 309 మంది శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్లు షానవాజ్, గియాజ్‌బేగం, మమత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వొళ్లు నొప్పులకు మందులు ఇచ్చారు



రెండు రోజుల కిందట ఏఎన్ఎం, వలంటీర్ మా ఇంటికి వచ్చారు. అవ్వా నీ ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీయగా నాకు జ్వరం, కాళ్ల నొప్పులు ఉన్నాయని చెప్పారు. మంగళవారం గ్రామానికి పెద్ద డాక్టర్లు వస్తారు చూపించుకోమని చెప్పారు. వారు చెప్పినట్లుగా గ్రామంలో డాక్టర్లకు చూపించుకోగా ఆరోగ్య పరీక్షలు చేసి నొప్పులకు ఉచితంగా మందులు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– అనుమంతి, కందుకూరు గ్రామం

కంటి పరీక్ష చేయించుకున్నాను



కొద్ది రోజులుగా వయస్సు పైబడడంతో కళ్లు మసకగా కనిపిస్తున్నాయి. ఏఎన్ఎం మా ఇంటికి వచ్చి కంటి డాక్టర్లు వస్తారు చూపించుకొమ్మని చెప్పింది. సురక్ష వైద్య శిబిరానికి వెళ్లి కంటి పరీక్షలు చేయించుకున్నాను. డాక్టర్లు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. పెద్ద డాక్టర్లందరూ మా గ్రామానికే వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయడం ఆనందంగా ఉంది. కంటి అద్దాలు కూడా ఇస్తామన్నారు.

– నరసప్ప, కందుకూరు గ్రామం

నేటి సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజల ఆరోగ్య వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే వైద్య శిబిరాలకు వచ్చి స్పెషలిస్ట్ డాక్టర్ల వద్ద వైద్య చేయించుకోవాలని ప్రజలకు వివరిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్‌ను మంగళవారం అధికారులు విడుదల చేశారు.

మండలం	గ్రామం	స్థలం
ఆదోని పట్టణం	కిలిచిన్‌పేట	మార్గ రామలింగేశ్వర టెంపుల్
ఆదోని పట్టణం	విక్టోరియాపేట	పాండురంగస్వామి టెంపుల్
ఆదోని మండలం	బసాపురం	గ్రామ సచివాలయం
కోసిగి	జంపాపురం	ప్రభుత్వ ఉన్నత పాఠశాల
కౌతాళం	పొదలకుంట	గ్రామ సచివాలయం
మంత్రాలయం	చెట్నిహళ్లి	గ్రామ సచివాలయం

బాధితులకు న్యాయం చేయాలి

ఆదోనిరూరల్: సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కె.అజయ్‌బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు వివాదాస్పదంగా మారిన సర్వే నంబర్ 352లోని భూమిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా సాదాపురం గ్రామ పంచాయతీలో సర్వే నంబర్ 352లో కొంత భూమి వివాదాస్పద వ్యక్తుల మధ్య తరచూ వార్తల్లోనూ, సోషల్ మీడియా ద్వారా కబ్జాలకు గురవుతున్నట్లు సమాచారం తెలియడంతో పరిశీలించడం జరిగిందన్నారు. పాలకులు, అధికారుల వైఫల్యంతో నిజమైన లబ్ధిదారులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అమాయకులకు వివాదాస్పద ఇళ్ల స్థలాలు అమ్మి డబ్బులు పోగు చేసుకున్నారన్నారు. ఒకే ప్లాటును ఇద్దరు, ముగ్గురికి రిజిస్ట్రేషన్‌లు చేయించడం వల్ల నష్టపోయిన లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారన్నారు. ఇప్పటికైనా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావిరాజు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బి.వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సుంకేశ్వరి గ్రామంలో పౌష్టికాహార కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి

మంత్రాలయం: గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో పాలన ఎలా ఉండేది.. ఇప్పుడు ఎలా ఉందో మీకందరికీ తెలుసని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు ఓట్ల కోసం మాయమాటలు చెబుతూ మళ్లీ వస్తారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలోనే నెరవేర్చలేని హామీలను ఇచ్చి ప్రజలను నిండా ముంచిన ఘనత మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. ప్రతి పేదవాడి ఆరోగ్యానికి పెద్దపీట వేయడమే కాకుండా ఖరీదైన వైద్యాన్ని గ్రామంలోనే అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రధాన రహదారుల రూపు రేఖలే మారిపోయాయన్నారు. సుంకేశ్వరి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని రూ.50 లక్షలతో అలాగే రూ.65 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, రూ.20 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, రూ.55 లక్షలతో తాగునీటి సౌకర్యం, పైపులైన్, రూ.5 లక్షలతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం పలువురు నాయకులు, అధికారులు వారిని గజమాలతో సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి, ఎస్ఐ కిరణ్, ఎంపీడీఓ మణిమంజరి, ఈఓపీఆర్డీ ప్రభావతి, ఏపీఎం జయశ్రీ, ఏపీవో తిమ్మారెడ్డి, సర్పంచ్ ముక్కరన్న, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 19వ తేదీన ఎమ్మిగనూరుకు రానున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పిలుపునిచ్చారు.

సురక్ష శిబిరానికి విశేష స్పందన

సుంకేశ్వరి గ్రామంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పర్యవేక్షించారు. శిబిరంలో 390 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు ఆరోగ్య సేవలందించారు. మండల వైద్యాధికారి డాక్టర్ గోవిందమ్మ, డాక్టర్ గీత, డాక్టర్ సురేష్, డాక్టర్ చేతన్ ఆరోగ్య పరీక్షలు చేసి మందులు, అవసరమైన వారికి కళ్లద్దాలు ఉచితంగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఏర్పాటు చేసి సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కౌతాళం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని డంబలదిన్నె గ్రామంలో కుమార్‌గౌడ్, ఎంపీపీ అమరేష్, మండల కన్వీనర్ ప్రహ్లాదచారితో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిన తీరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందన్నారు. మాజీ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు టీడీపీని నమ్మే స్థితిలో లేరన్నారు. పార్టీలన్నీ కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు.



గ్రామస్తురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు తమ పార్టీకి విజయాన్ని తెచ్చిపెడతాయని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు గురునాథ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, రౌడూరు పాండురంగారెడ్డి, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలోని హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి పరచాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బసవన్న గౌడ్, బీజేపీ జిల్లా నాయకులు నాగరాజుగౌడ్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్మశాన వాటికు సందర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలైన మంచినీటి వసతి, అలాగే లైట్లు ఏర్పాటు చేయాలని, దహన కార్యక్రమం నిర్వహించే ప్రదేశంలో ఏర్పాటు చేసిన షెడ్డుపై భాగంలో రేకులన్నీ రంధ్రాలు పడి ఉన్నాయన్నారు. వాటిని మరమ్మతులు చేయాలని, శ్మశాన వాటికలో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయాలని, అలాగే రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలని, మున్సిపాలిటీ అధికారులు ప్రతినెలా పర్యవేక్షణ చేసి అక్కడ నెలకొన్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు పంపాపతి, ఆంజనేయులు, చెన్నబసప్ప, కాలురామ్, పురోహిత్, భజరంగదళ్ కన్వీనర్ రవిశంకర్, జగదీష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు

పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట శ్మశాన వాటికలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సొంత నిధులతో మంగళవారం బోరును ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో బోరును వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. బీసీ శ్మశాన వాటికలో నీటిసౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారన్నారు. స్పందించిన ఆయన బోరును వేయించడంతో బీసీ సోదరులు, గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.







పంచముఖాలతో గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న వాసవీమాత, మంత్రాలయం: శాకంబరీ దేవి అలంకరణలో మంచాలమ్మ, చంద్రఘంట దేవి అలంకరణలో శాంభవీదేవి

అన్నపూర్ణేశ్వరీ నమోస్తుతే

ఆదోనిఅర్బన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆయా అమ్మవారి దేవాలయాల్లో, ఆయా వీధుల్లో కొలువుదీరిన విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిగాయి. నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు వేకువజామునే ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, సామూహికవ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ అలంకారాల్లో అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ మేరకు శివుడికి భిక్షం వేస్తూ అన్నపూర్ణేశ్వరిగా, నవధాన్యాల అలంకారం, పంచముఖాలతో గాయత్రీదేవిలుగా భక్తులకు అమ్మవార్లు దర్శనమిచ్చారు.

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజున అమ్మవారు చంద్రఘంట దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఆలయంలో వేకువజాము నుంచి అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేపట్టారు. అనంతరం అలంకరణలు చేసి ఫల పుష్పాలు సమర్పించి మహామంగళ హారతులు గావించి పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దేవి పురాణం వినిపించారు. పూజల్లో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: ఆశ్వీయుజ శుద్ధ విదియ మంగళవారం రోజున నవరాత్రులను పురస్కరించుకొని మండల కేంద్రంలోని వెలసిన కాళీమాత అన్నపూర్ణదేవీగా దర్శనమిచ్చారు. మండల పరిధిలోని దొడ్డిమేకలలో వెలసిన పార్వతీదేవి, మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి, లక్ష్మమ్మవ్వలతో పాటు మండలంలో వెలసిన అమ్మవార్లు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజార్లు నరసింహాచారి, శరవయ్యాచారి, వీరభద్రయ్య, ఉదయం జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, బిల్వార్చన, అభిషేకాలు వంటి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



అన్నపూర్ణేశ్వరిగా ఫారెస్ట్ లైన్ అంబాభవానీదేవి

కౌతాళం: మండలంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేపట్టారు. తెల్లవారుజామున జమ్మిచెట్టును పూజించి మొక్కులు తీర్చుకున్నారు. కౌతాళంలో చౌడేశ్వరిదేవి ఆలయంలో, ఈరన్న కట్టవద్ద ఉన్న మహంకాళి దేవి దేవాలయం వద్ద, కౌతాళం శివారులో వెలసిన ఆదిబసవేశ్వరస్వామి ప్రత్యేక పూజలు చేపట్టారు.



నవధాన్యాల అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ

మంత్రాలయం: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు గ్రామ దేవత మంచాలమ్మ శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వాసవీ దేవస్థాన సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. అధ్యక్షులు నారయణశెట్టి ఆధ్వర్యంలో గౌతమ్‌స్వామి నేతృత్వంలో పూజలు చేశారు.